అక్రమ నిర్మాణాల కూల్చివేతపై వెనక్కితగ్గం!

- బాధితులకు పరిహారంపై 'అఖిలపక్షం'
- జవహర్ నగర్‌లో భూములిచ్చేందుకైనా సిద్ధమే...
- ఫాం హౌజ్‌లను కాపాడుకునేందుకు మూసీ ముసుగెందుకు?
- బిఆర్ఎస్ నాయకులపై సిఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం
- మోడీ చేస్తే ఒకే...మేము చేస్తే తప్పా?: ఈటలకు సూటి ప్రశ్న
- ఫ్యామీలీ ఐడి, ఫ్యామిలీ డిజిటల్ కార్డు పైలెట్ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవం

ఫ్యామిలీ డిజిటల్ కార్డుల పైలెట్ ప్రాజెక్టును ప్రారంభిస్తున్న సిఎం రేవంత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చెరువులు, నాలాలపై అక్రమ నిర్మాణాల కూల్చివేత విషయంలో వెనక్కితగ్గే ప్రసక్తేలేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టంచేశారు. చెరువుల్లో అక్రమంగా లేఅవుట్లు వేసి పేద,మధ్యతరగతి ప్రజల్ని ముంచింది బిఆర్ఎస్ నేతలేనని చెప్పారు. మూసీ ప్రక్షాళనలో ఇళ్లు కోల్పోతున్న బాధితులకు డబుల్ బెడ్ రూం ఇల్లుతో పాటు రూ.25 వేల నగదు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఇంకా మెరుగ్గా ఇచ్చేందుకు ప్రభుత్వం వెనకాడబోదని అన్నారు. జవహర్ నగర్‌లో వెయ్యి ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, అక్కడ ఇచ్చేందుకైనా అభ్యంతరంలేదని తెలిపారు.

అక్రమాల తొలగింపు, బాధితులకు పరిహారం అందజేతపై అఖిలపక్ష సమావేశం నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని సిఎం చెప్పారు. హైడ్రా పై అసెంబ్లీలో సుదీర్ఘంగా చర్చ జరిగితే అక్కడ ఏం మాట్లాడకుండా ఇప్పుడు బిఆర్ఎస్ నాయకులు నానా యాగీ చేస్తున్నారని విమర్శించారు, కేవలం ఆ పార్టీ నాయకుల ఫాంహౌజ్‌లను కాపాడుకునేందుకే మూసీ ముసుగేసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలను ముందుకు నెట్టి తమ ఫాంహౌజ్‌లను కాపాడుకునేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. పేదలు నిరంతరం మూసీ కాలుష్యంతోనే బతకాలా? ఆత్మగౌరవంతో వారు జీవించొద్దా? అని ప్రశ్నించారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో బిఆర్ఎస్ నాయకులు ఆక్రమణలు చేసి 100 గజాలకు రూ.10 లక్షల చొప్పున అమ్మారనీ, కొనుకున్న వారంతా వారి చొక్కాలు పట్టుకుంటారని భయపడి హంగామా చేస్తున్నారన్నారు. ఆక్రమణలు తొలగించకుంటే ఏదో ఒక రోజు భారీ వరదలకు హైదరాబాద్ మునిగిపోదా? హైదరాబాద్ నాశనం కావాలని కోరుకుంటున్నారా? అని ప్రశ్నించారు. హైదరాబాద్‌ను ప్రమాదం నుంచి కాపాడేందుకు కూల్చివేతలను కొనసాగించి తీరుతామని స్పష్టం చేశారు. అదే సమయంలో నిర్వాసితులకు న్యాయం చేసేందుకు ఏం చేయాలో చర్చించేందుకు సిద్ధమన్నారు.

హైదరాబాద్‌లోని సిక్ విలేజ్ హాకీగ్రౌండ్స్‌లో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిఎం రేవంత్ రెడ్డి ఫ్యామిలీ ఐడి, ఫ్యామిలీ డిజిటల్ కార్డుల పైలెట్ ప్రాజెక్టును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదలనుంచి హైదరాబాద్‌ను కాపాడేందుకు తాము ప్రయత్నిస్తుంటే కిరాయి మనుషులతో బిఆర్ఎస్ అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. తొడుక్కునేందుకు చెప్పులు లేని దశ నుంచి బిఆర్ఎస్ ఖాతాలో రూ.1,500 కోట్లకు ఎగబాకారని తెలిపారు. బిఆర్ఎస్‌కు పేదలపై నిజంగా ప్రేముంటే రూ.500 కోట్లు ఇవ్వాలన్నారు.

"జన్వాడలో కేటీఆర్, అజీజ్‌నగర్‌లో హరీశ్ రావు ఫాంహౌజ్‌లతో పాటు సబితా ఇంద్రారెడ్డి ముగ్గురు కుమారుల ఫాంహౌజ్‌లు, కెవిపి రాంచందర్ రావు విల్లాలను కూలగొట్టొద్దా..? నల్లచెరువు, సున్నంచెరువు, మూసీ పరివాహక ప్రాంతాల్లో బిఆర్ఎస్ నాయకులు ఆక్రమించుకుని అమ్ముకోలేదా? మూసీని అడ్డం పెట్టుకుని ఎక్కువ కాలం తప్పించుకోలేరు. ఒక్కొక్కరి భరతం పడతా. అడ్డుకునే వారికి సంచులొస్తాయి కానీ ఆక్రమణలు తొలగించే వారికి కాదు" అని అన్నారు.

మోడీ చేస్తే ఓకేనా.. : మేం చేస్తే తప్పా?

గుజరాత్‌లో సబర్మతీ ప్రక్షాళన చేపట్టిన ప్రధాని మోడీకి ఊడిగం చేస్తున్న మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ మూసీ ప్రక్షాళనను వ్యతిరేకిస్తున్నారని విమర్శించారు. మోడీ చేసింది కరెక్టైతే తాము చేసింది తప్పెలా అవుతుందని ప్రశ్నించారు. కేంద్రం నుంచి నిధులు రాబట్టుకునేందుకు కలిసి రావాలని ఈటలకు సూచించారు. కెటిఆర్, హరీశ్ రావు హైడ్రాను తప్పుపడుతూ మాట్లాడిన దాని జిరాక్స్ కాపీ తీసుకుని విమర్శించడం మానుకోవాలని హితవు పలికారు. నగరం చుట్టూ బిజెపి ఎంపిలే గెలిచారని, కేంద్రం నుంచి రూ.25 వేల కోట్లు తెచ్చేందుకు ముందు నిలబడాలని సవాల్ చేశారు. కంటోన్మెంట్ పరిధిలో రక్షణశాఖ భూమిలో ఉన్న పేదలకు ఇళ్ల పట్టాలివ్వనున్నట్టు తెలిపారు. దానికి బదులుగా ఇప్పటికే రక్షణశాఖకు భూమికి బదులుగా భూమిని ఇచ్చినట్టు తెలిపారు. కేంద్రం నుంచి కారిడార్ ను సాధించినట్టు తెలిపారు.

ఒక రాష్ట్రం...ఒక కార్డు

ప్రజలకు అందించే సంక్షేమ కార్యక్రమాలను సులభంగా అందరికి అందుబాటులోకి తెచ్చేందుకు వీలుగా ఫ్యామిలీ ఐడి, హెల్త్ కార్డును తీసుకొస్తున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ కార్డు ద్వారా ఎక్కడైనా రేషన్ తీసుకునే సౌకర్యం, అనారోగ్యం బారిన పడినప్పుడు ఒక్క క్లిక్ పాత ఆరోగ్య చరిత్ర తెలిసి వేగంగా వైద్యమందడం, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర సంక్షేమ పథకాలకు డిజిటల్‌కార్డు ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. మళ్లీ మళ్లీ వైద్య పరీక్షలు చేయాల్సిన బాధ తప్పుతుందని చెప్పారు.

రాష్ట్ర హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పైలెట్ ప్రాజెక్టు ఐదు రోజుల పాటు 119 నియోజకవర్గాల్లో నియోజవర్గానికి రెండు పాయింట్ల చొప్పున నిర్వహిస్తారని తెలిపారు. ప్రజలు, ప్రతిపక్షాలు, మేధావుల నుంచి వచ్చే సూచనలు, సలహాలు స్వీకరిస్తామని స్పష్టం చేశారు. గత బిఆర్ఎస్ సర్కారు 1.33 లక్షల ఇండ్లకు టెండర్లు పిలిచి అందులో కేవలం 65 వేల ఇండ్లను మాత్రమే పూర్తి చేసిందనీ, మిగిలిన వాటి నిర్మాణాలను కాంగ్రెస్ పూర్తి చేసిందని తెలిపారు. దసరాలోపు అర్హులకు వాటిని అందజేయనున్నట్టు ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే శ్రీగణేష్, ఎంఐఎం ఎమ్మెల్సీ బేగ్, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఐటి శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ పాల్గొన్నారు.

చేపపిల్లలను నీటిలో వదులుతున్న మంత్రి పొన్నం

మత్స్యకారులకు అండగా ప్రభుత్వం

- మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మత్స్యకారులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం ఉంటుందని రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని లోయర్ మానేరు డ్యామ్‌లో గురువారం ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ అధ్యక్షతన 100శాతం సబ్సిడీతో చేప పిల్లల విడుదల కార్యక్రమం నిర్వహించారు. డ్యామ్ వద్ద గంగమ్మ తల్లికి మంత్రి పూజలు చేసి చేప పిల్లలు విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చేప పిల్లల పంపిణీ కొంత జాప్యం జరిగిన మాట వాస్తవమని, కొన్ని సంవత్సరాలుగా చేప పిల్లలు పంపిణీ చేసిన వారికి బకాయిలు చెల్లించాల్సి ఉందని తెలిపారు. పరస్పర ఫిర్యాదులు విచారణ జరుగుతుండటం, పాత బకాయిలు న్యాయబద్ధంగా రావాల్సినవి ఇప్పించడం, ఇప్పుడు సప్లయ్ చేసిన వారికి కూడా బిల్లులు త్వరగా చెల్లించాలని ముఖ్యమంత్రి చెప్పడంతోనే చేప పిల్లల పంపిణీ కార్యక్రమం ఆలస్యమయినట్టు చెప్పారు. కులవృత్తులు ఉపాధి పొందాలన్న సిఎం పట్టుదల, కృషితోనే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించుకున్నామని అన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బడ్జెట్ సమీక్షా సమావేశాల సందర్భంగా మత్స్యశాఖ చెల్లించాల్సిన బిల్లులు రూ.40వేల కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, రూ.75 వేల కోట్ల పనులు శాంక్షన్ చేసి పెండింగ్ పెట్టారని తెలిపారు. ఎంఎస్ఎంఇ పాలసీలో తెలంగాణలోని అన్ని కులవృత్తులను పెడుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మేయర్ సునీల్‌రావు, ఫిషరీస్ కమిషనర్ ప్రియాంక ఆలా, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, మత్స్య పారిశ్రామిక సంఘం జిల్లా చైర్మన్ పిట్టల రవీందర్ పాల్గొన్నారు.

కెఎల్‌హెచ్ క్యాంపస్‌కు అవార్డులు

హైదరాబాద్ : ఎడ్యుస్కిల్స్ వర్చువల్ ఇంటర్న్‌షిప్ ర్యాంకింగ్స్ 2024లో అసాధారణమైన ప్రదర్శనను కనబర్చినట్లు కెఎల్ డీమ్డ్ టు బి యూనివర్శిటీ వెల్లడించింది. ఈ విశ్వవిద్యాలయం అధునాతన ఇంటర్న్‌షిప్ పర్యావరణ వ్యవస్థను సృష్టించడం ద్వారా డిజిటల్ వర్క్‌ఫోర్స్ ఆఫ్ టుమారోని నిర్మించడంలో అందించిన తోడ్పాటుకుగానూ ప్రతిష్టాత్మకమైన జాతీయ స్థాయి ర్యాంకింగ్‌లను పొందినట్లు పేర్కొంది. దాని విజయవాడ క్యాంపస్‌కు 4వ స్థానం, హైదరాబాద్ క్యాంపస్‌కు 7వ స్థానం దక్కినట్లు తెలిపింది.

డిఎంహెచ్ఒల అసోసియేషన్ అధ్యక్షునిగా పుట్ల శ్రీనివాస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జిల్లా వైద్యారోగ్య అధికారుల (డిఎంహెచ్ఒ)ల అసోసియేషన్ అధ్యక్షునిగా డాక్టర్ పుట్ల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. 2024-2026 వరకు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. ఆయనతో పాటు ప్రధాన కార్యదర్శి డాక్టర్ సుధాకర్ లాల్, కోశాధికారిగా డాక్టర్ అప్పయ్య, ఉపాధ్యక్షులుగా డాక్టర్ హరీశ్ రాజ్, డాక్టర్ కోటాచలం, డాక్టర్ రాంకుమార్, డాక్టర్ సౌభాగ్యలక్ష్మి, కార్యదర్శులుగా డాక్టర్ సాంబశివరావు, డాక్టర్ రాజశ్రీ, డాక్టర్ మధుసూదన్, కార్యవర్గ సభ్యులుగా డాక్టర్ రఘునాథస్వామి, డాక్టర్ శ్రీరాం, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ పద్మ, డాక్టర్ స్వరాజ్యలక్ష్మిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ పుట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ... రాష్ట్ర వైద్యవిద్య సంచాలకుల పరిధిలో పదవీ విరమణ వయస్సును 65 ఏండ్లకు పెంచినట్టుగానే తమ రిటైర్మెంట్ వయస్సును కూడా 65 సంవత్సరాలకు పెంచాలనీ, అదే విధంగా వెహికిల్ సదుపాయాన్ని కల్పించాలని కోరారు. త్వరలోనే వైద్యారోగ్యశాఖ మంత్రిని కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేయనున్నట్టు తెలిపారు.

విలీన గ్రామాలను తిరిగి జిపిలుగా మార్చాలి

- విలీన గ్రామాల ఐక్య వేదిక అధ్యక్షులు బోల్గం నాగరాజు గౌడ్
- చిన్న బోనాల వార్డు కార్యాలయం ఎదుట గ్రామస్తుల నిరసన, ర్యాలీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిరిసిల్ల మున్సిపల్‌లో విలీనమైన గ్రామాలను తిరిగి గ్రామ పంచాయతీలుగానే కొనసాగించాలని విలీన గ్రామాల ఐక్య వేదిక అధ్యక్షులు, 10వ వార్డు కౌన్సిలర్ బొల్గం నాగరాజు గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చిన్న బోనాల వార్డు కార్యాలయం ఎదుట మహిళలతో కలిసి బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామస్తుల ప్రజాభిప్రాయం తీసుకోకుండా ఏడు గ్రామాలను గత ప్రభుత్వం సిరిసిల్ల మున్సిపల్‌లో విలీనం చేసిందన్నారు. మున్సిపాలిటీలో విలీనమైతే అభివృద్ధి చేస్తామని చెప్పిన అధికారులు, నాయకులు ఇప్పుడు తమ సమస్యలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గ్రామాలు విలీనం కావడంతో ఉపాధిహామీ పనులకు దూరమయ్యామని, ఇంటి, నల్లా తదితర పన్నులు పెరగడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాలు లేవన్నారు. ఎన్నికల సమయంలో మాజీ మంత్రి కెటిఆర్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి... విలీనమైన గ్రామాలను తిరిగి గ్రామపంచాయతీలుగా మారుస్తామని హామీ ఇచ్చి విస్మరించారని తెలిపారు. ఇప్పటికైనా విలీన గ్రామాలను తిరిగి గ్రామపంచాయతీలుగా మార్చేందుకు చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం గ్రామంలో 300పైగా మహిళలతో కలిసి ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో విలీన గ్రామాల ఐక్య వేదిక సభ్యులు సలేంద్రి బాలరాజ్ యాదవ్, అతికం నర్సయ్య గౌడ్, వంగ అనిల్ కుమార్ గౌడ్, బాల కిషన్ గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతుల రుణం తీర్చుకుంటాం

- త్వరలో రైతు భరోసా అమలు
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల
- కెసిఆర్ గౌరవాన్ని కాపాడుకోవడం లేదు : మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



రాష్ట్రంలో రైతు సంక్షేమానికి తల తాకట్టు పెట్టయినా నిధులు తీసుకొచ్చి రైతు సంక్షేమానికి సిఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తారని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో నూతన వ్యవసాయ మార్కెట్ పాలకవర్గ ప్రమాణ స్వీకారానికి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. ముందుగా ప్రజ్ఞాపూర్ నుంచి మార్కెట్ కమిటీ కార్యాలయం వరకు భారీ ర్యాలీతో మంత్రులకు బోనాలు డప్పులతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. రాష్ట్రంలో 28 లక్షల మంది రైతులకు రూ.18 వేల కోట్ల రుణమాఫీ చేశామని, మిగతావి త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. గత ప్రభుత్వం లక్ష రూపాయల రుణమాఫీకి ఏండ్లు పట్టిందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం.. ప్రతి కుటుంబానికి రూ.2లక్షల రుణమాఫీ చేసేందుకు సంసిద్ధంగా ఉందని, ఈ విషయాన్ని సీఎం ఇప్పటికే ప్రకటించినట్టు గుర్తు చేశారు. దేశంలోనే వ్యవసాయ రంగంలో సిద్దిపేట జిల్లా అగ్రస్థానంలో ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుకుంటుందని, అందుకు రూ. 300 కోట్లతో వచ్చే ఏడాది ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు. రైతు భరోసాను త్వరలోనే అందిస్తామని, ఇందుకు కసరత్తు జరుగుతున్నదని చెప్పారు. రాష్ట్రంలో రైతుల యాంత్రిక అవసరాలకు కావలసిన రూ600 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు.

రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను తాను గౌరవిస్తానని, ఆ గౌరవాన్ని కేసీఆర్ కాపాడుకోవడం లేదని అన్నారు. ఎంతో అనుభవం ఉన్న నేత రాష్ట్ర ప్రభుత్వానికి సూచనలు, సలహాలు ఇస్తారని ఆశించామని, కానీ మొత్తానికే కనిపించకుండా పోయారని తెలిపారు. రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రూ.10 వేల కోట్లు నష్టపోగా, కేంద్రం రూ.400 కోట్లు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుందని అన్నారు. రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా ఫలితం లేకపోయిందన్నారు. అనంతరం డిసిసి అధ్యక్షులు నర్సారెడ్డి మాట్లాడుతూ.. ప్రతిపక్షనేతగా కేసీఆర్ ఉండాల్సింది వ్యవసాయ క్షేత్రంలో కాదని, ప్రజా క్షేత్రంలో అని హితవుపలికారు. గజ్వేల్ నియోజకవర్గ ఎమ్మెల్యే కేసీఆర్ అందుబాటులో లేకపోవడం వల్ల పథకాల అమలు, సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే ఆయన ప్రజల్లోకి రావాలని, లేదంటే కనిపించడం లేదంటూ గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేస్తామని తెలిపారు. నూతనంగా ఏర్పడిన మార్కెట్ కమిటీ పాలకవర్గాలు.. రైతు సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ రఘోత్తం రెడ్డి, డిసిసిబి చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చైర్మన్ నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎవరిపైనా వ్యక్తిగత ద్వేషం లేదు

- మనోభావాలు దెబ్బతీయడం మా ఉద్దేశం కాదు
- మంత్రి కొండా సురేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కెటిఆర్‌ను విమర్శించే క్రమంలో సినీ ఇండస్ట్రీ గురించి తాను చేసిన వ్యాఖ్యలకు ఎవరైనా మనస్తాపానికి గురైతే వాటిని బేషరుత్తుగా వెనక్కు తీసుకుంటున్నట్టు మంత్రి కొండా సురేఖ తెలిపారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్.. తనపై రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడంతో భావోద్వేగానికి గురై మాట్లాడానని, ఆయనపై విమర్శలు చేసే క్రమంలో సినీ ఇండస్ట్రీలోని ఓ కుటుంబాన్ని ప్రస్తావించినట్టు మంత్రి చెప్పారు. మంత్రి చేసిన వ్యాఖ్యలు రాష్ట్రంలో పెద్ద దుమారాన్నే రేపిన సంగతి తెలిసిందే. దాంతో ఆమె స్పందించి.. తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నట్టు ప్రకటించారు. హన్మకొండలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె దీనిపై మీడియాతో మాట్లాడారు. మహిళల పట్ల ఒక నాయకుడు చిన్న చూపు ధోరణిని ప్రశ్నించడమే తన ఉద్దేశ్యమని, కానీ భావోద్వేగంతో మరో మహిళపై తాను వ్యాఖ్యలు చేశారని, వారి మనోభావాలను దెబ్బతీయడం తన అభిమతం కాదంటూ వివరణ ఇచ్చారు. నటి సమంత స్వయంకృషితో ఎదిగారని, ఆమెపై తనకు వ్యక్తిగత ద్వేషాలు లేవని, పైగా తాను సమంతకి అభిమానినని తెలిపారు. ఏ విషయంలో అయితే తాను బాధపడ్డానో, అదే విషయంలో మరొకరిని నొప్పించానని తెలిసి బాధపడ్డానని, తనలా వారు బాధపడకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఎక్స్ వేదికగానూ పోస్ట్ చేశారు.

'మోడల్' టీచర్లకు ఉద్యోగోన్నతులు కల్పించాలి

- విద్యాశాఖ ముఖ్యకార్యదర్శికి టిఎంఎస్‌టిఎ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులను కల్పించాలని టిఎంఎస్‌టిఎ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశాన్ని గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూతం యాకమల్లు, ప్రధాన కార్యదర్శి కె నగేశ్ నేతృత్వంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. అర్హులైన పిజిటిలకు ప్రిన్సిపాళ్లుగా, టిజిటిలకు పిజిటిలుగా ఉద్యోగోన్నతులు కల్పించాలని కోరారు. మోడల్ స్కూళ్లు ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు ఒకే క్యాడర్‌లో పనిచేస్తున్నామని తెలిపారు. ఉద్యోగోన్నతులు కల్పించి ఖాళీల్లో నూతన నియామకాలను చేపట్టాలని కోరారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దు కింద వేతనాలను చెల్లించాలని పేర్కొన్నారు. కారుణ్య నియామకాలను చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టిఎంఎస్టీఎ సహాధ్యక్షులు రాజుకుమార్, నాయకులు రవీందర్‌గౌడ్, శ్రీనివాస్, కిరణ్‌కుమార్, బుచ్చన్న పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లపై ప్రత్యేక దృష్టి

- సన్న వడ్లకు క్వింటాకు రూ.500 బోనస్
- 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో జమ
- రైతులను మోసం చేసే వారిపై కఠిన చర్యలు
- జిల్లా కలెక్టర్లు, ఎస్‌పిలతో వీడియో కాన్ఫరెన్స్‌లో సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అన్ని జిల్లాల్లోనూ ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సాఫీగా సాగేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదేశించారు. రైతులకిచ్చిన హామీమేరకు ఈ సీజన్ నుంచే సన్నాలకు ఎమ్మెస్పీకి అదనంగా ఒక్కో క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లిస్తుందని స్పష్టం చేశారు. గత సీజన్‌లో ధాన్యం అమ్మిన రైతులకు మూడురోజుల్లో డబ్బులు వేశామని గుర్తుచేశారు. ఈసారి 48 గంటల్లోపే రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేసేందుకు ప్రయత్నించాలని సూచించారు. గురువారం సచివాలయం నుంచి కలెక్టర్లు, ఎస్‌పిలతో సిఎం రేవంత్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అందులో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, సివిల్ సప్లయిస్ ఎండి డిఎస్ చౌహాన్, వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి రఘునందన్‌రావు, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ..ఈసారి ఏడు వేలకుపైగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఎక్కడైనా అవసరమైతే కొత్త కేంద్రాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్లకు సూచించారు. వ్యవసాయ శాఖ అంచనా ప్రకారం వానాకాలంలో 66.73 లక్షల ఎకరాల్లో వరి సాగైందని, రికార్డు స్థాయిలో 140 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందని వివరించారు. సన్న వడ్లకు బోనస్ ఇవ్వడంలో తప్పులు దొర్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. సన్నవడ్లకు వేర్వేరు కాంటాలు ఏర్పాటు చేయాలన్నారు. నిర్దేశిత ప్రమాణాల ప్రకారం సన్న రకాలను ధ్రువీకరించే యంత్రాలను, సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ప్రతి కేంద్రానికీ ఒక నెంబర్ కేటాయించాలని, కొనుగోలు చేసే ధాన్యం బస్తాలపై ఆ నెంబర్ కచ్చితంగా వేయాలని సూచించారు. సరిహద్దు రాష్ట్రాల నుంచి ధాన్యం రాష్ట్రంలోకి రాకుండా అన్ని మార్గాల్లోనూ పకడ్బందీగా నిఘా ఉంచాలని, చెక్ పోస్టుల వద్ద నిరంతర పర్యవేక్షణ పెంచాలని ఆదేశించారు. తాలు, తరుగు, తేమ పేరుతో రైతులను మోసం చేసే వారిని సహించవద్దని, అవసరమైతే క్రిమినల్ కేసులు పెడుతామని హెచ్చరించారు. రైతులు ఎక్కడా దోపిడీకి గురి కాకూడదని, రైతుల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును కలెక్టర్లు బాధ్యతగా స్వీకరించాలని ఆదేశించారు. గోనెసంచులు, టార్పాలిన్లు, మాయిశ్చర్ మిషన్లు, డ్రైయర్లు, ప్యాడ్ క్లీనర్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ధాన్యాన్ని ఎప్పటికప్పుడు తరలించేలా లారీలను సమకూర్చుకోవాలని ఆదేశించారు. ప్రతి గంటకోసారి కొనుగోలు కేంద్రాలకు వాతావరణ శాఖ సూచనలను చేరవేయాలనీ, దానికి అనుగుణంగా కేంద్రాల్లో ధాన్యం తడవకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. కొనుగోళ్ల ప్రక్రియను సమీక్షించాలని, ప్రతి రోజూ ఉదయం నేరుగా క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లి కేంద్రాలను పరిశీలించాలని ఆదేశించారు. పాత పది జిల్లాలకు నియమించిన ప్రత్యేకాధికారులు ధాన్యం సేకరణ ప్రక్రియను పర్యవేక్షించాలని సూచించారు. సమస్యల పరిష్కారం కోసం సివిల్ సప్లయిస్ విభాగంలో 24 గంటలూ అందుబాటులో ఉండేలా కాల్ సెంటర్ ఏర్పాటు చేయాలన్నారు. దొడ్డు వడ్లకు మార్కెట్‌లో డిమాండ్ లేదని, ఎఫ్‌సిఐ వద్ద భారీగా నిల్వలున్నాయని సిఎం చెప్పారు. సన్నాలను ప్రోత్సహించేందుకే బోనస్‌ను తీసుకొచ్చామన్నారు. ఈ ఏడాది రాష్ట్రంలో వరి విస్తీర్ణంలో 58 శాతం సన్న రకాలనే సాగు చేశారని, ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకంతో వచ్చే ఏడాది నుంచి మరింత దిగుబడి పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వచ్చే జనవరి నుంచి రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తామన్నారు. ఈసారి దిగుబడి అయ్యే 146 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యంలో ట్రేడర్లు, మిల్లర్లు, కొనుగోలు చేసే ధాన్యం, రైతులు తమ అవసరాలకు ఉంచుకునే నిల్వలు పక్కనపెడితే.. 91 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంటుందని అంచనా వేశారు. అందులో 44 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు రకం, 47 లక్షల మెట్రిక్ టన్నుల సన్న రకాలు ఉంటాయని చెప్పారు. గతంలో వరుసగా బకాయి పడ్డ డిఫాల్టర్ మిల్లర్లకు ధాన్యం ఇవ్వొద్దని ఆదేశించారు. మిగతా మిల్లర్లకు కూడా బ్యాంకు గ్యారంటీ తీసుకొని ధాన్యం ఇవ్వాలని సూచించారు.

డిఎస్‌సి సర్టిఫికెట్ల పరిశీలన

అన్ని జిల్లాల్లో డిఎస్‌సి సర్టిఫికెట్ల పరిశీలనను ఈ నెల ఐదో తేదీలోగా పూర్తి చేయాలని కలెక్టర్లను సిఎం ఆదేశించారు. మొత్తం 11062 మంది ఎంపికైన అభ్యర్థులకు దసరా పండుగలోపు నియామక పత్రాలను అందిస్తామని ప్రకటించారు. అక్టోబర్ తొమ్మిదో తేదీన ఎల్బీ స్టేడియంలో నియామక పత్రాలు అందించేందుకు వీలుగా జిల్లాల్లో వేగంగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటికే 9090 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయిందని విద్యాశాఖ అధికారులు సిఎంకు వివరించారు.

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (SENIOR DIVISION) :: TENALI
I.A. NO. 396/2023 IN O.S. NO. 15/2022
Between:
Tadiboyina Rajesh ...Petitioner/Plaintiff
And
Tadiboyina Rajya Lakshmi (Died) & others
.... Respondents/Defendants
(R4) Tadiboyina Lenin Babu
S/o. Seetharamaiah,
R/o. Plot No. 401, Crest Residency
Rukminipuri Colony, Dr.A.S.Rao Nagar
Hyderabad, Telangana State
పై నెంబరు పిటీషనులో పై తెల్పిన 4వ రెస్పాండెంట్‌కి పై శ్రీకోర్టువారి ద్వారా పంపిన ఐ.ఏ. నోటీసులను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టువారు సబ్‌స్టిట్యూట్ ఉత్తర్వుల ప్రకారము ది.21-10-2024వ తేదీ ఉదయం గం.10-30 నిమిషములకు శ్రీ కోర్టువారి ఎదుట మీరు స్వయంగా గానీ, న్యాయవాది ద్వారా గానీ హాజరై మీ యొక్క ఆక్షేపణలు ఏమైనా వున్నచో తెలుపగలరు. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానం చేయబడును.
దిండు శ్రీనివాస్ **B. Com, B.L.,**
పిటీషనరు తరుపున న్యాయవాది, తెనాలి.
సెల్ నెం : 9849229704.

మహారాజశ్రీ ప్రిన్సిపాల్ ఫ్యామిలీ జడ్జి వారి కోర్టులో, చెన్నై
హెచ్.ఎం.ఓ.పి. నెం.82 / 2024
శ్రీమతి **రేష్మా బేతాళ,** భర్త **చేతన్ బేతాళ,** తండ్రి **ఎం. సంతోష్ కుమార్ లుంకర్,** బ్లాక్.3, 5 ఇందూస్ అంబర్, అపార్ట్‌మెంట్, నెం.73, వెస్ట్ జోన్స్, వెస్ట్ సైదాపేట్, చెన్నై - 600015. - పిటిషనర్
మరియు
మిస్టర్ చేతన్ బేతాళ, తండ్రి **భూపాల్ రాజ్ బేతాళ,** ప్లాట్ నెం.16, భవనా ఎన్‌క్లేవ్ ఫేజ్ 1, న్యూ బోవెన్‌పల్లి, తిరుమలగిరి, హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్-500011. - రెస్పాండెంట్
పై నెంబరు కేసులో పిటిషనరు మీ మీద పై వారి కోర్టులో విడాకులు కోరుతూ పై తెలిపిన కోర్టులో మీపై పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో మీకు నోటీసు నిమిత్తం **తే30-10-2024ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టు లో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
రేష్మా బేతాళ
పిటిషనరు ఇన్ పర్సన్, చెన్నై.

ఒంగోలు మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
OS No : 491/2022
మీసాల వెంకటేశ్వరరావు ... వాది
వర్సెస్
మీసాల హనుమంతరావు మరియు వగైరా
..... ప్రతివాదులు
To
D4) పిట్టా సరస్వతి,
D/o వెంకటస్వామి,
R/o.డి.ఆర్.డి.ఎల్.కాంచన్ బాగ్,
లాబ్ క్వార్టర్స్, చంద్రయాన్ గుట్టా ,హైదరాబాద్.
పై నెంబర్ దావా అయిన OS No 491/2022లో 4, ప్రతివాదైనా నీకు ఇందు మూలముగా తెలియజేయునది ఏమనగా పై నెంబరు దావా OS No.491/2023లో నీ హాజరు నిమిత్తము తేది:14-10-2024న వాయిదా కలదు. కనుక ఆరోజు అనగా తేది: 14-10-2024 న ఉదయం గం.10.30 నిమిషాలకు పై కోర్టు వారి ఎదుట నీవు స్వయంగా గాని లేదా లాయరు గారి ద్వారా గాని హాజరై పైనెంబరు దావాలో నీ ఆక్షేపణలు తెలియ జేసుకోనవలెను లేనియెడల పైనెంబర్ దావా నీ పరోక్షమున తీర్మానించెదరు
// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
ఇట్లు
పెండ్యాల శివహరి
షేక్ హిదాయతుల్లా
అడ్వకేట్స్,ఒంగోలు

పరిశుభ్రతను కాపాడుకోవాలి

- ఐసిఎఆర్ క్రిడ డైరెక్టర్ డాక్టర్ వికేసింగ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మన పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రతను కాపాడుకోవాలని ఐసిఎఆర్ క్రిడ డైరెక్టర్ డాక్టర్ వికేసింగ్ సూచించారు. గురువారం హైదరాబాద్‌లోని సంతోష్‌నగర్‌లోని క్రిడ కార్యాలయంలో గాంధీజయంతిని పురస్కరించుకుని స్వచ్ఛ భారత్ దివస్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిశుభ్రత డ్రైవ్ భాగంగా పాత రికార్డులను తొలగించడం, పారవేయడం, సేంద్రియ వ్యర్థాలను కంపోస్ట్ ఉత్పత్తికి వినియోగించడం, డ్రైనేజీ, నీటి మార్గాలను శుభ్రపరచడం, నీటి స్తబ్దతను తొలగించడం వంటి కార్యక్రమాలను చేయాలని కోరారు. సింగిల్ ప్లాస్టిక్ విధానాన్ని మానేసి, తిరిగి పదార్థాల కోసం వినియోగించడం, రీసైకిల్ చేయడం కోసం చిత్తశుద్ధితో కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గౌరవ్ ప్రియా పాండురంగ్, శాస్త్రవేత్తలు, సిబ్బంది, విద్యార్థులతో సహా దాదాపు 80 మంది పాల్గొన్నారు. రంగోలీ, క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.

సుప్రీంకోర్టు తీర్పుకు విరుద్ధంగా సిఎం రేవంత్‌రెడ్డి

- మందకృష్ణ మాదిగ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎస్సి వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు విరుద్ధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ విమర్శించారు. ఎస్‌సి వర్గీకరణ చేసే హక్కు రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని సుప్రీం కోర్టు చెప్పిందని తెలిపారు. ఆ తీర్పు వెలువడిన వెంటనే సిఎం రేవంత్‌రెడ్డి స్పందించారనీ, అందరి కంటే ముందుగా సుప్రీం కోర్టు తీర్పును స్వాగతించారని గుర్తుచేశారు. గురువారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. డిఎస్‌సి ఫలితాలు విడుదల చేశారనీ, తొమ్మిదిన నియామక పత్రాలు ఇస్తామన్నారన్నారు. సుప్రీం కోర్టు తీర్పు వెలువడిన తర్వాత డిఎస్‌సి పరీక్షలు జరిగాయని చెప్పారు. డిఎస్‌సి ఫలితాలు ప్రకటించారనీ, వర్గీకరణ విసయంలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించారు. చట్ట సభలో ఇచ్చిన మాటకు విరుద్ధంగా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సుప్రీం తీర్పు అనంతరం పంజాబ్, తమిళనాడు ఎస్‌సి వర్గీకరణను అమలు చేస్తున్నదని తెలిపారు. రాష్ట్రంలో మంత్రివర్గ ఉప సంఘం వేసి అనంతరం అమలు చేస్తామని రేవంత్ చెప్పారనీ, ఇప్పటి వరకు ఈ విషయంపై ఎందుకు నిర్ణయం తీసుకోవడం లేదని ప్రశ్నించారు. అదిష్టానం ఒత్తిడి ఒకవైపు, ఇంకోవైపు రాష్ట్రంలో మాలల ఒత్తిడి వల్ల వర్గీకరణ అమల్లో వెనుకాడుతున్నారా? అని ప్రశ్నించారు.

సంఘం బలోపేతానికి కృషి

- డిసెంబర్ 28,29,30 తేదీల్లో టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర మహాసభలు
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి
- నల్లగొండలో రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డిసెంబర్ 28, 29, 30 తేదీల్లో నల్లగొండలో టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర మహాసభలు జరగనున్నాయని, వాటిని విజయవంతం చేయడానికి ఆహ్వానసంఘం కమిటీని ఎన్నుకున్నట్టు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి తెలిపారు. గురువారం నల్లగొండ జిల్లాకేంద్రంలోని ఎస్‌బిఆర్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో టిఎస్ యుటిఎఫ్ నల్లగొండ జిల్లా అధ్యక్షులు ఎడ్ల సైదులు అధ్యక్షతన నిర్వహించిన రాష్ట్ర మహాసభల నిర్వాహక ఆహ్వానసంఘం ఏర్పాటు సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబర్‌లో నల్లగొండ జిల్లా కేంద్రంలో జరగనున్న తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర మహాసభలను ఘనంగా నిర్వహించాలని, నల్లగొండ జిల్లా నాయకులు, కార్యకర్తలకు మార్గనిర్దేశం చేశారు. రాష్ట్ర మహాసభల నిర్వహణ ద్వారా సంఘం బలోపేతానికి ప్రణాళికలు రూపొందించుకోవాలని తెలిపారు. టిఎస్ యుటిఎఫ్.. ఉపాధ్యాయులు అందరిదీ అనే భావన వచ్చే విధంగా సంఘం నాయకులు, కార్యకర్తలు సేవా దృక్పథంతో పనిచేయాలని కోరారు. రాష్ట్ర అధ్యక్షులు జంగయ్య మాట్లాడుతూ.. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఏర్పడి 50 ఏండ్లు పూర్తయ్యాయని, సంఘం పూర్వ నాయకులు చెన్నుపాటి, ఏవీఎస్, రాంరెడ్డి లాంటి నాయకుల ఆశయాలకు అనుగుణంగా తామంతా పని చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి మాట్లాడుతూ.. సంఘ ప్రతిష్ట మరింతగా పెరిగి విధంగా రాష్ట్ర ఆరో మహాసభలను నల్లగొండలో విజయవంతంగా నిర్వహించాలని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్ రాములు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో నల్లగొండ జిల్లాలో 2009లో రాష్ట్ర మహాసభలు నిర్వహించుకున్నామని, రాష్ట్ర విభజన తర్వాత ఇప్పుడు నల్లగొండలో జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు రాజశేఖర్‌రెడ్డి, నాగమణి, సీనియర్ నాయకులు మాణిక్‌రెడ్డి, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మలవీరారెడ్డి, కృష్ణమూర్తి, బంగారయ్య, టిఎస్ యుటిఎఫ్ సూర్యాపేట, యాదాద్రి జిల్లాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అనిల్‌కుమార్, సోంబాబు, ముక్కెర్ల యాదయ్య, దామోదర్, జెవివి, టాప్రా, పౌర స్పందన వేదిక నాయకులు తదితరులు పాల్గొన్నారు..

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

ఆహ్వాన సంఘం కమిటీ ఎన్నిక

చైర్మన్‌గా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, కార్యనిర్వాహక చైర్మన్‌గా ఎం రాజశేఖర్‌రెడ్డి, కో చైర్మన్లుగా సంఘం రాష్ట్ర కార్యదర్శి జి నాగమణి, జిల్లా అధ్యక్షులు వై సైదులు, ప్రధాన కార్యదర్శి పి వెంకటేశం, కోశాధికారిగా నర్రా శేఖర్‌రెడ్డి, వైస్‌చైర్మన్‌గా బి శ్రీనివాస్‌చారి ఎన్నికయ్యారు.

కెసిఆర్ ఎక్కడ ?

- పదవీ కాంక్షతో కెటిఆర్ ఏదో చేసే ఉంటారు..
- గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తాం..
- మంత్రి కొండా సురేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"రాష్ట్ర ప్రతిపక్ష నేత కెసిఆర్ అసలు ఉన్నారా..? పదవీ కోసం పాకులాడుతున్న కెటిఆర్.. ఫామ్‌హౌస్‌లో కెసిఆర్‌ను ఏదోచేసే ఉంటారు.." అంటూ మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ.. మరోసారి కెటిఆర్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. గురువారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో నూతన వ్యవసాయ మార్కెట్ పాలకవర్గ ప్రమాణ స్వీకారానికి ఆమెతో పాటు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కెటిఆర్‌పై మరోసారి ఘాటైన వ్యాఖ్యలు చేశారు. పదవుల కోసం కెటిఆర్, హరీశ్‌రావు.. ఏమైనా చేస్తారని అన్నారు. బడ్జెట్ రోజు అసెంబ్లీకి వచ్చిన కెసిఆర్.. ఆ తర్వాత బయట కనిపించడంలేదని, ఫామ్ హౌస్‌లో ఏం చేస్తున్నారో తెలియదని అన్నారు. నియోజకవర్గానికి కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం చెక్కులు 850 వరకు ఉన్నాయని, ఎమ్మెల్యే ఉంటేనే వాటిని పంపిణీ చేయాలనే నిబంధనలను కాంగ్రెస్ ప్రభుత్వం పాటిస్తుందన్నారు. కాబట్టి, గజ్వేల్ నియోజకవర్గ ప్రజలకు ప్రాతినిధ్యం వహించే కెసిఆర్ కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేయాలని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నర్సారెడ్డితో పాటు క్యాడర్‌కు పిలుపునిచ్చారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

ఇష్టానుసారంగా మాట్లాడితే కెటిఆర్ తాట తీస్తా

ఇటీవల కెటిఆర్ సోషల్ మీడియాలో ఇష్టాసారంగా మాట్లాడుతున్నారని, అలా మాట్లాడితే ఆయన తాట తీస్తానని మంత్రి కొండా సురేఖ ఆగ్రహం వ్యక్తం చేశారు. పదవుల కోసం కెసిఆర్ కుటుంబం ఏమైనా చేస్తుందని ఆరోపించారు. గత ఎన్నికల్లో బిఆర్‌ఎస్ ఓడిపోవడానికి ప్రధాన కారణం కేటీఆరేనని, పదవిలో ఉన్నప్పుడు సిఎం స్థాయిలో ఇష్టం వచ్చినట్టు నిర్ణయాలు తీసుకున్నారని అన్నారు. ఇప్పుడు పదవి పోయేసరికి ఏం చేయాలో అర్థంకాక ఇష్టంవచ్చినట్టు మాట్టాడుతున్నారని, సోషల్ మీడియాను అడ్డంపెట్టుకొని తనపై పిచ్చి రాతలు రాయిస్తున్నారని మండి పడ్డారు. కూతురు కవిత బెయిల్ కోసం కెసిఆర్ రాష్ట్ర ప్రజల గొంతు కోశారని, మెదక్ పార్లమెంట్ స్థానాన్ని బిజెపికి కట్టబెట్టేలా ప్రధాని, అమిత్‌షాతో మాట్లాడి చీకటి ఒప్పందం చేసుకున్నారని తెలిపారు. అందుకే పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్‌ఎస్ నుంచి బిజెపికి క్రాస్ ఓటింగ్ జరిగిందని ఆరోపించారు.

డిఎస్‌సితోపాటు జెఎల్ నియామకాలు చేపట్టాలి

- ఎస్ఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో డిఎస్‌సి ద్వారా ఉపాధ్యాయ అభ్యర్థులకు ఈనెల తొమ్మిదో తేదీన ఎల్బీ స్టేడియంలో నియామక పత్రాలను అందిస్తామంటూ ప్రభుత్వం ప్రకటించడాన్ని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. డిఎస్‌సి రాసిన అభ్యర్థులు, ప్రధానంగా మంచి ర్యాంకు పొంది ఉద్యోగం సాధించారని తెలిపారు. వారిలో కొందరు జూనియర్ లెక్చరర్ (జెఎల్) రాతపరీక్షల్లో కూడా మంచి ర్యాంకు సాధించారని పేర్కొన్నారు. దీనివల్ల డీఎస్సీలో ఉద్యోగం సాధించిన అభ్యర్థి జెఎల్ ఉద్యోగం సాధిస్తే ఆ తర్వాత ఉపాధ్యాయ పోస్టులను వదిలేలే అవకాశం ఉంటుందని వివరించారు. అందుకే జెఎల్ పోస్టులకు తుది ఫలితాలను వెంటనే ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డిఎస్‌సి నియామకాలతో పాటు జెఎల్ నియామకాలను కూడా చేపడితే ఈ సమస్యలు తలెత్తే అవకాశం ఉండబోదని తెలిపారు. అభ్యర్థులకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఉపాధ్యాయ ఖాళీలు మిగిలే అవకాశం ఉండబోదని వివరించారు.

పారితోషికాలు పెండింగ్ డబ్బులు చెల్లించాలి

ఆశావర్కర్స్ యూనియన్ వినతి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఆశావర్కర్లకు సెప్టెంబర్ నెల పారితోషికాలు, లెప్రసీ, పల్స్ పోలియో పెండింగ్ డబ్బులను వెంటనే చెల్లించాలని తెలంగాణ ఆశావర్కర్స్ యూనియన్ (సిఐటియు) కోరింది. ఈ మేరకు ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి జయలక్ష్మి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ నీలాదేవి, రాష్ట్ర కోశాధికారి పి గంగమణి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాసు మాధవి వైద్యారోగ్యశాఖ కమిషనర్‌కు గురువారం విన్నవించారు. అత్యంత ముఖ్యమైన పండుగలు బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో పారితోషికాలు రాకపోవడంతో వర్కర్లు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. గత రెండు నెలల నుంచి ప్రతి నెలా చివరి తేదీన వేస్తున్నట్టుగానే ఈ సారి కూడా సెప్టెంబర్ చివర్లో వేయలేదని తెలిపారు. సకాలంలో పారితోషికాలు రాకపోవడంతో ఆశావర్కర్ల కుటుంబాలు నిరాశ చెందుతున్నాయని తెలిపారు. పండుగల వేళ కుటుంబాల్లో ఖర్చులను పరిగణనలోకి తీసుకుని సెప్టెంబర్ పారితోషికంతో పాటు 2023, 2024 రెండు సంవత్సరాల లెప్రసీ సర్వే, 2024లో చేసిన పల్స్ పోలియో పెండింగ్ డబ్బులు మొత్తం చెల్లించి ఆర్థికంగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఇజ్రాయెల్ మారణకాండకు వ్యతిరేకంగా

7న జిల్లా కేంద్రాల్లో నిరసన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గాజాలో ఇజ్రాయెల్ మారణకాండకు పాల్పడి ఈనెల ఏడో తేదీ నాటికి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా వామపక్ష పార్టీల రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో ఆరోజు నిరసన దినం పాటించాలని కేంద్ర వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. అందులో భాగంగా రాష్ట్రంలోని జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలను జరపాలని తెలంగాణ వామపక్ష పార్టీలు ప్రకటించాయి. ఈ మేరకు తమ్మినేని వీరభద్రం (సిపిఎం), కూనంనేని సాంబశివరావు (సిపిఐ), పోటు రంగారావు (సిపిఐఎంఎల్ మాస్‌లైన్), సాధినేని వెంకటేశ్వరరావు (సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ), జెవి చలపతిరావు (సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ), గాదగోని రవి (ఎంసిపిఐయు), సిహెచ్ మురహరి (ఎస్‌యూసిఐసి), ప్రసాదన్న (సిపిఐఎంఎల్), జానకి రాములు (ఆర్ఎస్‌పి), బి సురేందర్‌రెడ్డి (ఫార్వర్డ్‌బ్లాక్), ఎం రమేష్ రాజా (సిపిఐఎంఎల్ లిబరేషన్) సంయుక్తంగా గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. సామ్రాజ్యవాద అమెరికా అండదండలతో ఇజ్రాయెల్ చేస్తున్న దురాక్రమణపూరిత యుద్ధ దాడులతో పాలస్తీనా అతలాకుతలం అయ్యిందని విమర్శించారు. ఉద్దేశపూర్వకంగానే పాఠశాలలు, ఆస్పత్రులను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ ఈ దాడులకు పాల్పడిందని తెలిపారు. ఈ అత్యంత క్రూరమైన యుద్ధం వల్ల దాదాపు 41 వేల మంది పాలస్తీనియన్లు మరణించారని ఆందోళన వ్యక్తం చేశారు. వారిలో ఎక్కువ మంది మహిళలు, పిల్లలే సమిధలయ్యారని వివరించారు. వారే కాకుండా భవనాలు, పాఠశాలల కింద మరో 10 వేల మంది సమాధి అయ్యారని పేర్కొన్నారు. ఈ దుశ్చర్యకు వ్యతిరేకంగా పాలస్తీనాకు సంఘీభావంగా రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో ఈనెల ఏడో తేదీన నిరసన కార్యక్రమాలను నిర్వహించాలనీ, జయప్రదం చేయాలని కోరారు.

సమంతపై మంత్రి వ్యాఖ్యలు సరికాదు

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ పూజ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సినీ నటి సమంతపై మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు సరికాదనిభారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మక్కపల్లి పూజ తెలిపారు. గౌరవప్రదమైన పదవిలో మహిళా మంత్రిగా ఉండి ఇంకో మహిళపైన అసభ్యకరమైన వ్యాఖ్యలు చేయటం ఎంత వరకు సమంజసమని గురువారం ఒక ప్రకటనలో ఖండించారు. ఆమె తన రాజకీయ లబ్ధి కోసం ఇతరుల వ్యక్తిగత విషయాలను లాగడం సరైంది కాదని తెలిపారు. మంత్రి పదవిలో ఉండి అమ్మాయిల రక్షణ కోసం ఆలోచించకుండా ఇష్టం వచ్చినట్టు కించపరిచేలా మాట్లాడ్డం ఏంటని ప్రశ్నించారు. సమంత రాజ్యాంగ బద్ధంగా తన భర్త నుంచి విడాకులు తీసుకున్నారని, దాన్ని రాజకీయం కోసం వాడుకోవడం సరైంది కాదని పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాటిపై ప్రభుత్వం, మంత్రులు స్పందించాలని కోరారు. ఆడపిల్లలపై రోజూ లైంగిక దాడులు జరుగుతున్నాయని, వాటి గురించి మాట్లాడకుండా సినీనటుల వ్యక్తిగత అంశాలను మాట్లాడి రాజకీయ లబ్ధి పొందాలని చూడొద్దని కోరారు.

మెరుగైన బతుకు కోసం పోరాటాలు

- శ్రమదోపిడికి వ్యతిరేకంగా ఉద్యమిస్తూనే ఉంటాం
- అంతర్జాతీయ కార్మిక వర్గ పోరాట స్ఫూర్తితో ఐక్య ఉద్యమాలు
- 'అంతర్జాతీయ యాక్షన్ డే' కార్యక్రమంలో వక్తలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

'యుద్ధం వద్దు, ప్రపంచ శాంతి ముద్దు'. 'యుద్ధోన్మాదుల్లారా..కార్మిక వర్గ ఐక్యతను దెబ్బతీస్తారా? ఇక మీ ఆటలు సాగనివ్వం'. 'సామ్రాజ్యవాద యుద్ధ కాంక్ష నశించాలి. ప్రపంచ కార్మిక వర్గ ఐక్యత వర్ధిల్లాలి'. 'డౌన్ డౌన్ క్యాప్టలిజం' అంటూ కార్మిక సంఘాలు నినదించాయి. కార్మిక వర్గ ఐక్యతను దెబ్బతీయటమే యుద్ధోన్మాదుల కుట్ర అని సంఘాల నేతలు విమర్శించారు. కార్మికుల మెరుగైన, గౌరవ ప్రదమైన బతుకు కోసం పోరాటాలు నిర్వహిస్తూనే ఉంటామంటూ స్పష్టం చేశారు. శ్రమదోపిడికి వ్యతిరేకంగా, అంతార్జాతీయ కార్మిక వర్గ పోరాట స్ఫూర్తితో ఐక్య ఉద్యమాలు నిర్వహిస్తామని ప్రకటించారు. గురువారం హైదరాబాద్ ఆర్‌టిసి క్రాస్ రోడ్స్‌లో సిఐటియు, ఎఐటియుసి, ఎఐయుటియుసి ఆధ్వర్యంలో డబ్ల్యుఎఫ్‌టియు అవిర్భావ దినోత్సవం సందర్భంగా 'అంతర్జాతీయ యాక్షన్ డే'గా ఇచ్చిన పిలుపులో భాగంగా నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్‌వి రమ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎండీ యూసఫ్ మాట్లాడుతూ.. పొద్దస్తమానం రెక్కలు ముక్కలు చేసుకుంటూ సంపద ఉత్పత్తి చేస్తున్న కార్మిక వర్గానికి గౌరం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రమకు తగిన వేతనాలు రావడం లేదని చెప్పారు. తమ హక్కుల కోసం, గౌరవప్రదమైన బతుకు కోసం జరిగే పోరాటాలను నిర్వర్యం చేసేందుకు పెట్టుబడి దారులు ఎన్నో రకాల కుట్రలు చేస్తున్నారని వివరించారు. అంతర్జాతీయ కార్మిక వర్గ పోరాటాల స్ఫూర్తితో దేశంలో మోడీ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా బలమైన కార్మిక పోరాటాలు రాక తప్పవని చెప్పారు.

ఆర్‌టిసి క్రాస్‌రోడ్డులో నిరసన తెలుపుతున్న నాయకులు

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జె వెంకటేశ్ మాట్లాడుతూ..శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా కార్మికవర్గం అంతర్జాతీయ స్ఫూర్తితో పోరాటాలు నిర్వహించాలని కోరారు. పని భద్రత, జీవన పరిస్థితుల్లో మెరుగుదల సాధించేందుకు ఐక్యపోరాటాలు తప్పవని చెప్పారు. ప్రపంచంలో ఎక్కడైనా పాలకులు కార్మికుల కష్టాన్ని దోచుకోవడంలో తేడా లేదని చెప్పారు. కార్మికుల శ్రమకు తగిన వేతనాన్ని ఇవ్వడం లేదని తెలిపారు. కనీసం పోరాడి సాధించుకున్న చట్టాలను, జీవోలను కూడా అమలు చేయటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడి దారులు తమ లాభాల కోసం, సామ్రాజ్యవాద సంఘాల ప్రయోజనాల కోసం, ప్రజల సంపదను లాక్కోవాలని, మార్కెట్లను విభజించి, ఇంధన మార్గాలను జయించాలని చూస్తున్నాయన్నారు. సామ్రాజ్యవాదుల ఆధిపత్య కాంక్షతో జరిగే యుద్ధాలను, వాటి వల్ల ప్రజలకు, సమాజానికి జరిగే నష్టాన్ని నివారించేందుకు కార్మిక వర్గం అర్థం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు ఆంజనేయులు, సిఐటియు రాష్ట్ర కోశాధికారి వంగూరి రాములు, ఉపాధ్యక్షులు వీఎస్ రావు, పద్మశ్రీ, కూరపాటి రమేష్, కుమార స్వామి, ఎఐటియుసి నాయకులు కిషన్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి వ్యాఖ్యలు వెనక్కి తీసుకున్నారు

- చర్చకు ముగింపు పలకండి
- సినీ ప్రముఖులకు విజ్ఞప్తి : మహేష్‌కుమార్‌గౌడ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యల నేపథ్యంలో ఆ చర్చకు ముగింపు పలకాలని టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ సినీ ప్రముఖులకు విజ్ఞప్తి చేశారు. మీ మనస్సు నొచ్చుకుందని, మంత్రి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకున్నారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అంశాన్ని ఇక్కడితో ముగించాలని కోరారు. ఇరువైపులా మహిళలున్నారనీ, కావున ఆ విషయాన్ని ఇంతటితో వదిలిపెట్టాలని విజ్ఞప్తి చేశారు. 'మహిళల మనోభావాలను కించపరచాలని ఆమె ఉద్దేశం కాదు. కొండా సురేఖ ట్వీట్‌లో వారు హీరోయిన్‌గా ఎదిగిన తీరు కేవలం అభిమానం మాత్రమే కాదు నాకు ఆదర్శం కూడా అని ట్వీట్ చేశారు. ఒక సోదరుడు సోదరికి నూలు దండ వేస్తే ఆమెపై సోషల్ మీడియాలో చేసిన ట్రోల్స్ చూసాం. సమాజంలో ఒకరి గురించి ఒకరు చెడుగా మాట్లాడకండి. మా కాంగ్రెస్ నాయకులు మంత్రులకు విజ్ఞప్తి చేస్తున్న. మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా మాట్లాడండి' అని విజ్ఞప్తి చేశారు.

నేడు నిజామాబాద్‌కు మహేష్‌కుమార్‌గౌడ్

టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్ శుక్రవారం నిజామాబాద్ పర్యటకు వెళతున్నారు. పిసిసి అధ్యక్షులయ్యాక మొదటిసారిగా తన సొంత జిల్లాకు వెళ్తున్న ఆయనకు డిసిసి అధ్యక్షులు మోహన్ రెడ్డి భారీ స్వాగత ఏర్పాట్లు, భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశారు. పట్టణంలోని మాధవనగర్ సాయిబాబా గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అక్కడి నుంచి ర్యాలీగా బయలుదేరి ఓల్డ్ కలెక్టరేట్ మైదానంలో జరగనున్న భారీ బహిరంగ సభాస్థలికి చేరుకుంటారు. సభలో మంత్రులు, పలువురు ఎమ్మెల్యేలు, ఎంపిలు, ఎమ్మెల్సీలు, డిసిసి అధ్యక్షులు, సీనియర్ నాయకులు పాల్గొంటారు.

గాంధీభవన్‌లో ప్రతి శుక్రవారం పార్టీ నిర్వహిస్తున్న మంత్రుల ముఖాముఖి శనివారానికి వాయిదా వేసినట్టు మహేష్‌కుమార్‌గౌడ్ వెల్లడించారు. అనివార్య కారణాల వల్ల తేదీ మారిందనీ, ఈ విషయాన్ని గమనించాలని పార్టీ కార్యకర్తలకు, శ్రేణులకు, ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

మూసీ ప్రక్షాళనపై కెటిఆర్ రెండు నాల్కల ధోరణి

- నదికి ఇరువైపుల 55 కి.మీటర్ల హద్దులు గీసింది మీరే కదా
- అజ్ఞానపూరితంగా అధికార పక్షాన్ని బదనాం చేస్తారా? : బండి సుధాకర్‌గౌడ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మూసీనది ప్రక్షాళనపై మాజీ మంత్రి కెటిఆర్ రెండు నాల్కల ధోరణి ప్రదర్శిస్తున్నారని కాంగ్రెస్ అధికార ప్రతినిధి బండి సుధాకర్‌గౌడ్ విమర్శించారు. ఇది ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మున్సిపల్ శాఖ మంత్రిగా కెటిఆర్ అధ్యక్షతన నానక్‌రామ్ గూడలోని హైదరాబాద్ గ్రోత్ కారిడర్ కార్యాలయంలో అప్పటి మూసీ రివర్ డెవలప్‌మెంట్ చైర్మెన్ సుధీర్‌రెడ్డి, స్పెషల్ సిఎస్ అర్వింద్‌కుమార్, ఎంఆర్‌డిసిఎల్ ఎండి ఐపిఎస్ అధికారి విశ్వజిత్, ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, చంద్ర కళ, మాలతిలతో (2022, జనవరి) సమీక్షా సమావేశం నిర్వహించారని గుర్తు చేశారు. మూసీనది బఫర్ జోన్ పరిధి ఎడమ వైపు 55 కి.మీటర్లు, కుడి వైపు 55 కి.మీటర్లు హద్దులు నిర్ధారించాలని ఆదేశించింది మీరే కదా? అని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో సిఎం రేవంత్‌రెడ్డి మూసీ ప్రక్షాళన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. అధికారం కోల్పోయిన ఫ్రస్టేషన్‌తో ప్రజలను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్ జలాశయాలు కలుషితం కాకూడదనే ఉద్దేశంతో 84 గ్రామాల్లో క్యాచ్ మెంట్ ఏరియాను నిర్ధారిస్తూ 1996లో జిఓ 111ను అప్పటి ప్రభుత్వం తీసుకొచ్చిందని గుర్తు చేశారు. కేవలం రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే మూసీపై కెటిఆర్ విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. మూసీ నిర్వాసితులకు మెరుగైన నష్ట పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ఆయన వివరించారు.

జెఎల్ తుది ఫలితాలు విడుదలయ్యేలా చూడండి

- పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్‌కు అభ్యర్థుల వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో జూనియర్ లెక్చరర్ (జెఎల్) పోస్టులకు తుది ఫలితాలు త్వరగా విడుదలయ్యేలా చొరవ చూపాలని టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ బి మహేష్‌కుమార్‌గౌడ్‌ను పలువురు అభ్యర్థులు విజ్ఞప్తి చేశారు. గురువారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. పాఠశాలలతోపాటు, ప్రభుత్వ జూనియర్ కాలేజీలను కూడా బలోపేతం చేయాలంటే 1,392 జెఎల్ పోస్టులకు తుది ఫలితాలను ప్రకటించి నియామక పత్రాలను అందించాలని కోరారు. డిఎస్‌సి అభ్యర్థులకు ఫలితాలు ప్రకటించి నియామకపత్రాలను ఈనెల తొమ్మిదిన ఎల్బీ స్టేడియంలో అందిస్తామంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడం పట్ల ధన్యవాదాలు తెలిపారు. అదే తరహాలో పెండింగ్‌లో ఉన్న జెఎల్ తుది ఫలితాలను కూడా ప్రకటించాలని కోరారు. దసరా పండుగలోపు జెఎల్ నియామకాలను చేపట్టాలని తెలిపారు. తమ ఆందోళనను అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన మహేష్‌కుమార్‌గౌడ్ టిజిపిఎస్‌సి చైర్మన్‌కు ఫోన్ చేసి జెఎల్ ఫలితాలు త్వరగా వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అంతకుముందు ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ఆర్ట్స్ కళాశాల వద్ద, టిజిపిఎస్‌సి కార్యాలయం వద్ద జెఎల్ అభ్యర్థులు శాంతియుతంగా నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో జెఎల్ అభ్యర్థులు లింగనాయక్, వేణు, వీణ చారి, సతీష్ కుమార్, ప్రకాష్ నాయక్, చిదంబరం, శశికళ, చిత్ర దేవి, సాజిదా తదితరులు పాల్గొన్నారు.

బిగ్ సిలో దసరా ధమాక ఆఫర్లు

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

తెలుగు రాష్ట్రాల్లో టాప్ మొబైల్ రిటైలర్ బిగ్ సి ప్రస్తుత దసరా పండుగ సందర్భంగా ధమాక ఆఫర్లను అందిస్తుందని ఆ సంస్థ ఫౌండర్, సిఎండి ఎం బాలు చౌదరి తెలిపారు. తమ స్టోర్‌లో మొబైల్ కొనుగోళ్లపై నాలుగు ఆకర్షణీయ ఆఫర్లను ఇస్తున్నామన్నారు. "ప్రతీ మొబైల్ కొనుగోలుపై రూ.10 వేల వరకు విలువ గల మొబైల్ ప్రొటెక్షన్ ఉచితం. రూ.10 వేల వరకు తక్షణ క్యాష్ బ్యాక్, రూ.5,999 విలువ గల ఖచ్చితమైన బహుమతిని అందిస్తున్నాం. ఎలాంటి వడ్డీ, డౌన్ పేమెంట్ లేకుండానే మొబైల్ కొనుగోలు చేసే ఆకర్షణీయ సదుపాయాన్ని కల్పిస్తున్నాం." అని బాలు చౌదరి తెలిపారు. ఒప్పో మొబైల్ కొనుగోలుపై లక్కీ డ్రాలో రూ.10 లక్షల నగదు గెలుచుకోవచ్చన్నారు. వివో, రియల్‌మి, ఎంఐ మొబైల్ కొనుగోళ్లపై అనేక బహుమతులు గెలుచుకునే అవకాశం ఉందన్నారు. ఎటిఎం కార్డుతోనే మొబైల్, స్మార్ట్ టివి, ల్యాప్‌ట్యాప్, ఎయిర్ కండీషనర్‌లను ఎలాంటి వడ్డీ, డౌన్ పేమెంట్ లేకుండా కొనుగోలు చేయవచ్చన్నారు. ఈ ఆఫర్లను వినియోగదారులు ఉపయోగించుకోవాలని బాలు చౌదరి కోరారు.

దసరా ధమాకా ఆఫర్లను ఆవిష్కరిస్తున్న బిగ్ 'సి' సంస్థ ఫౌండర్ మరియు సి.ఎం.డి. శ్రీ యం. బాలు చౌదరి

హైదరాబాద్ నివాస అమ్మకాల్లో 9 శాతం వృద్ధి

నైట్ ఫ్రాంక్ రిపోర్ట్

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

ప్రస్తుత ఏడాది జులై నుంచి సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో దేశంలోని ఎనిమిది ప్రధాన నగరాల్లో నివాస అమ్మకాల్లో పెరుగుదల చోటు చేసుకుందని రియాల్టీ కన్సల్టెంట్ సంస్థ నైట్ ఫ్రాంక్ తెలిపింది. గురువారం విడుదల చేసిన ఈ రిపోర్ట్‌లో.. ముంబయి, హైదరాబాద్, బెంగళూరు, పూణె, అహ్మదాబాద్, చెన్నై, ఢిల్లీ ఎన్‌సిఆర్ నగరాల్లో 5 శాతం వృద్ధితో 87,108 యూనిట్ల విక్రయాలు జరిగాయని తెలిపింది. హైదరాబాద్‌లో 9 శాతం పెరుగుదలతో 9,114 యూనిట్ల అమ్మకాలు నమోదయ్యాయని వెల్లడించింది. ఎనిమిది ప్రధాన నగరాల్లోనూ రూ.1 కోటి పైగా విలువ కలిగిన నివాసాలకు అధిక డిమాండ్ నెలకొందని నైట్‌ఫ్రాంక్ సిఎండి శిశిర్ బైజల్ తెలిపారు.

సెర్చ్ కమిటీల భేటీ షురూ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో విశ్వవిద్యాలయాల ఉపకులపతుల (విసి) నియామకం ప్రక్రియకు సంబంధించి గురువారం నుంచి సెర్చ్ కమిటీల సమావేశాలు ప్రారంభమయ్యాయి. గురువారం రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మకమైన ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయు) సెర్చ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఓయు విసిగా ఆర్ లింబాద్రి, ప్రతాప్‌రెడ్డి, జిబిరెడ్డి, సిహెచ్ గోపాల్‌రెడ్డి, రవీందర్ యాదవ్‌ల పేర్లు పరిశీలనలో ఉన్నట్టు సమాచారం. వారిలో ఒకరికి వైస్ ఛాన్సలర్ పదవి వరించే అవకాశమున్నది. ఓయుతోపాటు పాలమూరు విశ్వవిద్యాలయం (పియు), పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సెర్చ్ కమిటీల సమావేశాలు జరిగాయి. ఈ వర్సిటీ సెర్చ్ కమిటీ సమావేశాన్ని తిరిగి ఎప్పుడు నిర్వహిస్తారన్నది ప్రస్తుతానికి ఖరారు కాలేదు. ఓయు, పియు, తెలుగు వర్సిటీల వీసీలకు సంబంధించి ముగ్గురి పేర్లతో కూడిన నివేదికను సెర్చ్ కమిటీలు ఖరారు చేశాయి. శుక్రవారం జెఎన్‌టియు హైదరాబాద్, కాకతీయ విశ్వవిద్యాలయం (కెయు), తెలంగాణ విశ్వవిద్యాలయం (టియు), శాతవాహన విశ్వవిద్యాలయం (టీయూ) సెర్చ్ కమిటీల సమావేశాలు జరుగుతాయి. జెఎన్ఎఎఫ్ఏయూ సెర్చ్ కమిటీ సభ్యుల్లో ఒకరు విదేశాల్లో ఉన్న కారణంగా ఆ వర్సిటీ సెర్చ్ కమిటీ సమావేశం కూడా వాయిదా పడింది. అయితే రాష్ట్రంలోని పది విశ్వవిద్యాలయాల సెర్చ్ కమిటీల సమావేశాలు పూర్తయ్యాకే అన్నింటికీ ఒకేసారి వైస్ ఛాన్సలర్ల పేర్లను ప్రభుత్వం ప్రకటించే అవకాశమున్నట్టు తెలిసింది. వాటితోపాటు తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం, ఆర్జీయూకేటీ బాసరకు కూడా కొత్త విసిలను ప్రభుత్వం ప్రకటిస్తుందని విశ్వసనీయంగా తెలిసింది. సెర్చ్ కమిటీల భేటీ పూర్తయ్యాక ఒక్కో విశ్వవిద్యాలయానికి సంబంధించి ముగ్గురు పేర్ల ప్రతిపాదనలతో రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేస్తాయి. వాటిని న్యాయ శాఖ పరిశీలించిన తర్వాత గవర్నర్ ఆమోదానికి ప్రభుత్వం పంపిస్తుంది. ముగ్గురు పేర్లలో ఒకరిని గవర్నర్ ఆమోదించిన తర్వాత విసిల నియామకానికి సంబంధించిన ఉత్తర్వులు వెలువడతాయి. రెండు విశ్వవిద్యాలయాల సెర్చ్ కమిటీలు వాయిదా పడడంతో ఈ ప్రక్రియ పూర్తి కావడానికి కొంత సమయం పట్టే అవకాశమున్నట్టు సమాచారం. దసరా తర్వాతే కొత్త వీసీల నియామకం ఉంటుందని అధికార వర్గాలు భావిస్తున్నాయి.